నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, సోమవారం 30 డిసెంబర్ 2024 | NALGONDA



టీఎస్ యూటీఎఫ్ మహా సభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య, వేదికపై ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఆ సంఘం నేతలు

## మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలి

- విద్యా వ్యవస్థ పటిష్టతకు సమృద్ధిగా నిధులు కేటాయించాలి
- రెండో రోజు టీఎస్ యూటీఎఫ్ మహా సభలో ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి

రామగిరి, డిసెంబర్ 29 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని, విద్యా రంగం బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. రెండో రోజు టీఎస్ యూటీఎఫ్ మహాసభలో భాగంగా ఆదివారం సభా వేదిక వద్ద ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు 15శాతం, కేంద్రం 5-6శాతం నిధులు కేటాయించాలన్నారు. గురుకులాలకు సైతం కేంద్రం 25శాతం నిధులు ఇవ్వాలన్నారు. ప్రాథమిక విద్యకు ఇచ్చే అరకొర నిధులు సరిపోవడం లేదని తెలిపారు. అమెరికా దేశాల్లో మాదిరిగా అందరికీ నాణ్యమైన ప్రభుత్వ విద్య అందించాలని డిమాండ్ చేశారు. బడికి సమాజాన్ని అనుసంధానం చేయాలని చర్చిస్తున్నామని, అందరి సహకారంతో ప్రభుత్వ పాఠశాల విద్య పటిష్టం జరుగాలని కోరారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలు పెరిపోతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా శాఖలో ఖాళీలను తక్షణమే భర్తీచేసి, ఇన్‌చార్జీల పాలనకు స్వస్తి పలుకాలని కోరారు. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ఇతర అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో తాత్కాలిక, కాంట్రాక్టు, పార్ట్‌టైం అనే బోధన వ్యవస్థ లేకుండా అందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కరిక్యులమ్‌తోపాటుకో కరిక్యులమ్ అంశాలు ఎలా ఉండాలనే దానిపై పలు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ 2009లో వచ్చిన విద్యాహక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. కేంద్రం నో డిటెన్షన్ పాలసీ రద్దు చేయడం సరిరికాదని తెలిపారు. గతంలో నో డిటెన్షన్ అంశం తెరపైకి వస్తే నాటి సీఎం కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారని, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా నో డిటెన్షన్ రద్దును వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఎన్ఈపీ -2020తో విద్య మరింత వ్యాపారం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి రూ. 8లక్షలకు, సేవింగ్స్ మినహాయింపు రూ. 5లక్షలకు పెంచాలన్నారు.

ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించారు.

### మోదీ పాలనలో పేదలకు చేసింది శూన్యం : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

కేంద్రంలో పదేండ్లుగా అధికారంలో ఉన్న ప్రధాని మోదీ సర్కారు పేదలకు, విద్యకు చేసింది శూన్యమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వీరయ్య అన్నారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు వనరులు లేవని తప్పుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య కేవలం ఉపాధ్యాయులది మాత్రమేనని, తమ బాధ్యత కాదని ఉపాధ్యాయులని దోషులుగా నిలబెడుతున్నాయని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించకుండా తప్పించుకుంటున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించకుంటే పిల్లలు ఎలా చేరుతారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలపై జిల్లాల వారీగా చర్చలు, ప్రగతి నివేదికలను ప్రవేశపెట్టి చర్చించారు. వీటిపై సోమవారం తీర్మానాలు చేయనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, జ్ఞానమంజరి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బక్కా శ్రీనివాసాచారి, పెరుమాళ్ల వెంకటేశం, కోశాధికారి నర్ర శేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, నలపరాజు వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షురాలు బడుగు అరుణ, ఆహ్వానం సంఘం ఉపాధ్యక్షుడు ఎడ్ల సైదులు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాకయ్య, రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినిధులుగా హాజరైన నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ త్రోబాల్‌లో లిషిత రెడ్డికి కప్

- ఇండియా తరపున ఆడిన చింతలపాలెం విద్యార్థి



చింతలపాలెం, డిసెంబర్ 29 : మండల పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి లిషిత రెడ్డి ఆదివారం తమిళనాడు వేదికగా జరిగిన ఇంటర్నేషనల్ త్రోబాల్ ఆటలో ఇండియా తరపున ఆడి శ్రీలంకపై ఘన విజయం సాధించింది. ప్రసుతం ఆమె మేడ్చల్ జిల్లాలోని సీఎంఆర్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నది. ఇండియా తరపున ఆడి గెలిచినందుకు లిషిత రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు. లిషిత రెడ్డి విద్యాభ్యాసం 1 నుంచి 10వ తరగతి వరకు సీతా మెమోరియల్ స్కూల్, ఇంటర్మీడియట్ కొండాపూర్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో పూర్తి చేసింది. లిషిత రెడ్డి చిన్నప్పటి నుంచి త్రోబాల్ ఆటపై ఆసక్తి చూపేదని తల్లిదండ్రులు అన్నపురెడ్డి గోవర్ధన్‌రెడ్డి, శిల్ప తెలిపారు.

# మిల్లర్ల అక్రమాలు..
# పక్క జిల్లాలకు సీఎంఆర్

సూర్యాపేట జిల్లాలో పలు రైస్ మిల్లులపై కేసులే కారణం

### గతంలో ధాన్యం తీసుకొని ప్రభుత్వానికి బియ్యం ఎగనామం

ఈ వానకాలం ధాన్యం జనగాం, యాదాద్రి భువనగిరి, వరంగల్ జిల్లాలకు కేటాయింపు

ఇప్పటికే 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలింపు

**కొంతమంది మిల్లర్ల అక్రమాల ఫలితం ఈ సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం సీఎంఆర్ కోసం పక్క జిల్లాలకు తరలాల్సిన దుస్థితి ఏర్పడింది. సూర్యాపేట జిల్లాలో సుమారు 90 మిల్లులు ఉండగా వందల కోట్ల రూపాయల ధాన్యం మాయం చేసిన 8 మిల్లులపై కేసులు నమోదు చేసి సీజ్ చేయగా మరో 23 మిల్లులు డీఫాల్ట్ కావడంతో మిగిలిన మిల్లులకు మాత్రమే సీఎంఆర్ ధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని కొనుగోలు కేంద్రాల నుంచి జనగాం, యాదాద్రిభువనగిరి, వరంగల్ జిల్లాలకు దాదాపు 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరలించారు. ఇంకా కొంత ధాన్యాన్ని తరలించనున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది.**

– సూర్యాపేట, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ)

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం గ్రామాల వారీగా కేంద్రాలు ఏర్పాటు కొనుగోలు చేస్తుంది. ఆ ధాన్యాన్ని మిల్లింగ్ కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న మిల్లులకు కేటాయించడం సాధారణమే. మిల్లులకు ఇచ్చే ధాన్యాన్ని మిల్లింగ్ చేసిన అనంతరం తిరిగి బియ్యం తీసుకుంటారు. గతంలో జిల్లాలో కొంతమంది మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని పక్కదారి పట్టించారు. ఆయా మిల్లులు రేయింబవళ్లు నడుస్తూ నెలనెలా లక్షలాది రూపాయల విద్యుత్ బిల్లులు ప్రభుత్వానికి చెల్లించగా బియ్యం మాత్రం సర్కారు ఇవ్వలేదు. ఆ బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకున్నట్లు నిర్ధారణ అయింది. కేవలం ఎనిమిది మిల్లుల్లోనే దాదాపు రూ.600 కోట్ల విలువ చేసే ధాన్యం కుంభకోణానికి పాల్పడగా మరికొన్ని మిల్లులు కలిపి దాదాపు మరో రూ.300 కోట్ల వరకు ధాన్యం పక్కదారి పట్టినట్లు సమాచారం. ఇలా అక్రమార్కులు సూర్యాపేట జిల్లా పరువును బజారుకీడ్చారు.

**మిల్లర్లు, అధికారుల పాపాలు.. జిల్లాకు శాపం**

కొంతమంది మిల్లర్లు, అధికారులు చేసిన పాపాలు జిల్లాకు శాపంగా పరిణమించాయి. గతంలో సూర్యాపేట జిల్లాలో పండిన పంటలను ఇక్కడే మిల్లింగ్ చేయగా ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. అక్రమాలకు పాల్పడిన మిల్లులు సీజ్ కావడం, డీఫాల్ట్ కావడంతో ధాన్యాన్ని ఇతర జిల్లాలకు తరలించాల్సిన దుస్థితి దాపురించింది. సూర్యాపేట జిల్లాలో సుమారు 80 మిల్లులు ఉండగా వీటిలో రూ.600 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని పక్కదారి పట్టించిన ఎనిమిది మిల్లులతో పాటు డీఫాల్ట్ అయిన మరో 23 మిల్లులకు ఈ సీజన్‌లో ధాన్యం ఇవ్వడం లేదు. మిగిలిన మిల్లులకు ఆయా మిల్లుల సామర్థ్యాన్ని బట్టి ధాన్యం కేటాయించారు. అక్రమాలకు పాల్పడింది భారీ మిల్లులు కావడం, వారికి సీఎంఆర్ ధాన్యం ఇవ్వకపోవడంతో ఈ సీజన్‌లో ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యంలో జనగాం జిల్లాకు 25వేల మెట్రిక్ టన్నులు, యాదాద్రిభువనగిరి, వరంగల్ జిల్లాలకు కలిపి 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించినట్లు తెలిసింది.



### డీఫాల్ట్ లేకుంటే ధాన్యం జిల్లాకు సరిపోయేది

జిల్లాలో కొన్ని మిల్లులు సీజ్ చేయడం, మరికొన్ని డీఫాల్ట్ కావడంతో ఆయా మిల్లులకు సీఎంఆర్ ధాన్యం ఇవ్వడం లేదు. వాస్తవానికి అన్ని మిల్లులకు ధాన్యం ఇచ్చే అవకాశం ఉంటే ఇక్కడి ధాన్యం ఇక్కడి మిల్లులకు సరిపోయేది. కానీ తప్పని పరిస్థితుల్లో ధాన్యాన్ని ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఇతర జిల్లాలకు తరలిస్తున్నాం. అక్రమాలు జరుగకుండా రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు తరుచూ మిల్లులను తనిఖీ చేస్తున్నారు.

**- ప్రసాద్, సివిల్ సప్లయ్ సూర్యాపేట జిల్లా మేనేజర్**

## వందేండ్ల సుదీర్ఘమైన పోరాటం సీపీఐది



సభను విజయవంతం చేయాలని విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఆ పార్టీ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం తదితరులు

- కార్మికులు, కర్షకులకు అండగా నిలిచాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- నేడు నల్లగొండలో సీపీఐ బహిరంగ సభ
- విజయవంతం చేయాలని నేతల పిలుపు

రామగిరి, డిసెంబర్ 29 : వందేళ్లు సుదీర్ఘమైన పోరాటాలు చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాదేనని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రధాన ప్రతిపక్షంగా పార్లమెంట్‌లో పనిచేసిన చరిత్ర తమ పార్టీదేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ 100 వసంతాల వేడుకల సందర్భంగా నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించే బహిరంగ సభ సందర్భంగా ఆదివారం నల్లగొండలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో, కార్మిక సమస్యల పరిష్కారంలో సీపీఐ అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. నైజాంకు వ్యతిరేకంగా, వెట్టిచాకిరి, దోపిడీ నుంచి విముక్తి కోసం ఉద్యమాలు చేశారని చెప్పారు. సీపీఐ నాయకత్వంలో మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. కార్మికుల 8 గంటల పని దినం, న్యాయబద్ధమైన వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, విద్యార్థి తదితర సంఘాల ఏర్పాటు కోసం పార్టీ ఉద్యమాలు చేసిందని చెప్పారు. దున్నే వారికి భూమి కోసం న్యాయమైన పోరాటం చేసి 10లక్షల ఎకరాలను పేదలకు అందించిన చరిత్ర సీపీఐదేనన్నారు. మతోన్మాద బీజేపీ అధికారంలోకి రాకుండా బీజేపీయేతర రాజకీయ పార్టీలను ఏకంచేసి నిలువరించామని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉండి అటు పార్లమెంట్, ఇటు శాసన సభల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను నిలదీశామన్నారు. పోరాట చరిత్ర కలిగిన నల్లగొండ గడ్డపై పార్టీ 100వ ఆవిర్భావ వేడుకలను నల్లగొండలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15వేల మందికిపైగా కమ్యూనిస్టులు ఎర్ర దుస్తులు ధరించి ఇక్కడికి వస్తారని చెప్పారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ వందేండ్ల ఆవిర్భావ వేడుకల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన సీపీఐ కార్యకర్తలు, యువగళం, కళాకారులు ఎర్రటి దుస్తులు ధరించి మధ్యాహ్నం 1:30 గంటలకు నల్లగొండలో గడియారం సెంటర్ నుంచి సభా వేదిక వరకు మహా ప్రదర్శన నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటలకు వరకు సభ జరుగుతుందని చెప్పారు. ఆ తర్వాత జరిగే బహిరంగ సభలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావుతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పలాల నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, మల్లేపల్లి ఆదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, లొడంగి శ్రవణ్‌కుమార్, వీరస్వామి, ఏఐఎస్ఎఫ్ఐ నాయకుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గంజాయి చాక్లెట్స్ తరలిస్తున్న నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

## ట్రావెల్స్ బస్సులో గంజాయి చాక్లెట్లు

- భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా పట్టివేత : ఆరుగురి అరెస్ట్

కోదాడ రూరల్, డిసెంబర్ 29 : ట్రావెల్స్ బస్సులో గంజాయి చాక్లెట్లను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కోదాడ మండలం నల్లబండగూడెం శివారులో ఆదివారం తనిఖీలు చేస్తుండగా గుర్తించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి శనివారం సాయంత్రం 5 గంటలకు కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్‌కు ప్రయాణికులతో బయల్దేరింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆరుగురు అనిల్‌కుమార్, రజనీషీ, బంకిన్‌చంద్రషీ, మామియానాయక్, సంజీబానీ, జానునాయక్ గంజాయితో తయారు చేసిన 5కేజీల చాక్లెట్స్‌ను ఒకొక్క ప్యాకెట్‌కు 40 చొప్పున 25 ప్యాకెట్స్‌లో పార్సిల్ చేసుకొని వస్తున్నారు. ఆంధ్రరాష్ట్రం పలాస వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద అక్కడ పోలీసులు తనిఖీలు నిర్వహించగా చాక్లెట్లు గుర్తించి అడుగగా ఆయుర్వేద వైద్యానికి సంబంధించినవని చెప్పి తప్పించుకున్నారు. ఆ బస్సు ఆదివారం తెల్లవారుజామున కో దాడ వద్దకు చేరుకోగా కోదాడ ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేసి వాటిని పరీక్షలకు పంపించారు.

అవి గంజాయితో తయారు చేసినవిగా రిపోర్టు రావడంతో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలో సీఐ శంకర్, ఎస్ఐ గోవర్ధన్, యాదయ్య, రామకృష్ణ, అస్గర్ అలీ, శ్రీను, లక్ష్మీనరసింహారావు, రాము, నరేశ్, ఉదయ్, జ్యోతి, భవాని, బాలు, సలీమ్ పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నాయకులు క్యామ మల్లేశ్, బూర

## దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్29 : తెలంగాణ రాష్ట్ర ఉద్యమ తొలితరం అమరవీరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని మల్లారెడ్డిగూడెం గ్రామంలో కురుమ సంఘం నాయకులు, గ్రామస్తులు కలిసి ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాల్లో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, నాయకులు కాసం వెంకటేశ్వర్లు, దోనూరి వీరారెడ్డి, కనకల శ్యామ్, చల్లమల్ల నర్సిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్రి నరసింహ, నాయకులు సుర్విరాజు, నర్రి స్వామి, రాజు, రామలింగం, ఎట్టయ్య, ఐలయ్య, వెంకన్న పాల్గొన్నారు.

## నార్మల్ డెయిరీనా..
## విజయ డెయిరీనా?

- యాదగిరిగుట్ట దేవస్థానానికి నెయ్యిని సరఫరా చేసే సంస్థపై సందిగ్ధత
- విజయ డెయిరీ వినియోగించాలని ప్రభుత్వం ఆదేశం
- నార్మల్ డెయిరీనే బెటర్ అంటున్న ఎమ్మెల్యేలు, ఎంపీ
- నేడో రేపో స్పష్టత వచ్చే అవకాశం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో వినియోగించే నెయ్యి కొనుగోలుపై సందిగ్ధత నెలకొన్నది. నార్మర్(మదర్)డెయిరీ సంస్థ నుంచి సేకరిస్తున్న నెయ్యిని నిలుపుదల చేసి ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని దేవాలయాలకు అదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వచ్చే జనవరి 1నుంచి నూతనంగా విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేసే ప్రక్రియ ఆయా దేవస్థాన అధికారులు చేపట్టగా యాదగిరిగుట్ట దేవస్థానంలో మాత్రం ఇందుకు భిన్నంగా నార్మర్ డెయిరీ నుంచి సేకరించాలని యోచిస్తున్నది. ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ సైతం పట్టుబట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. గత 40 ఏండ్లుగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రసాదాలతో పాటు నిత్య కైంకర్యాలకు నార్మల్ నెయ్యి మాత్రమే వినియోగిస్తున్నారు. టెండర్ ప్రకారం కిలోకు రూ. 609 ధరను కట్టిస్తున్నారు. లడ్డూ ప్రసాదంతోపాటు స్వామివారి పూజలకు రోజుకు 1000 కిలోల నెయ్యి వినియోగిస్తున్నారు. ఏడాదికి దాదాపుగా రూ. 15 కోట్లను దేవస్థానం నార్మల్ సంస్థ ఇస్తున్నది. ఇప్పటి వరకు నార్మల్ డెయిరీ నుంచి ఎలాంటి ఇబ్బందిగానీ, ఇతర కల్తీ జరిగిన్నట్లు ఫిర్యాదు రాలేదు. ఉమ్మడి నల్లగొండ- రంగారెడ్డి జిల్లాల పరిధిలోని విస్తరించిన నార్మల్ డెయిరీలో అత్యధికంగా జిల్లాకు చెందిన రైతులే ఎక్కువగా ఉన్నారు. మొత్తం 24 చిల్లింగ్ సెంటర్లుండగా 435 సొసైటీల ద్వారా సుమారు 45 వేల మంది రైతులు రోజుకు సగటున లక్ష లీటర్ల పాలు పోస్తున్నారు. ఇందులో అత్యధికంగా ఆలేరు, భువనగిరి నియోజకవర్గ పరిధిలోని 30 వేల మంది రైతులు, 12 చిల్లింగ్ సెంటర్లతో 60 వేల లీటర్ల పాలు నార్మల్‌కు విక్రయిస్తున్నారు. టెండర్ ప్రకారం 2025 డిసెంబర్ 31వ తేదీ వరకు నార్మల్ డెయిరీనే దేవస్థానానికి నెయ్యిని పంపిణీ చేయాలి. కానీ తాజాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదగిరిగుట్ట, చెర్వుగట్టు, కీసర, వేములవాడ తదితర దేవాలయాల్లో నార్మల్ డెయిరీ సంస్థను తొలగించి విజయ్ డెయిరీ సంస్థకు టెండర్ ఇచ్చేందుకు యోచిస్తున్నది. కానీ యాదగిరిగుట్ట, చెర్వుగట్టును మినహాయించి నార్మల్ డెయిరీ నెయ్యినే కొనుగోలు చేసే విధంగా స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ప్రభుత్వం విధానమే కొనసాగితే నార్మల్ ఆదాయానికి తీవ్ర గండి పడనున్నది.



భువనగిరి పట్టణంలో బస్సు జాతకు స్వాగతం పలికి ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు

## ఆశ కార్యకర్తలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

- భువనగిరికి చేరుకున్న బస్సు జాత

భువనగిరి అర్బన్, డిసెంబర్ 29 : ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పారితోషకాలు వెంటనే విడుదల చేయాలని ఆశ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని కోరుతూ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బస్సు జాత ఆదివారం భువనగిరి పట్టణానికి చేరుకోగా పట్టణ ఆశ కార్యకర్తలు స్వాగ తం పలికారు. ర్యాలీ నిర్వహించి వినాయక చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జయలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రె స్ ప్రభు త్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. డిసెంబర్ 15న నిర్మల్ జిల్లాలో ప్రారంభమైన ఆశ ల బస్సుజాత డిసెంబర్ 31న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ముగుస్తుందని, ముగింపు సభలో వేలాదిగా ఆశ వర్కర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## బతుకమ్మలతో నిరసన

- 20వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

రామగిరి, డిసెంబర్ 29 : తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక దీక్ష ఆదివారం 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు బతుకమ్మలు పేర్చి కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద ఆడిపాడి నిరసన తెలిపారు. అనంతరం ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో కీలక భూమిక పోషించే సమగ్ర శిక్ష ఉద్యోగులు, కేజీబీవీ, భవిత సెంటర్స్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలు ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నేతలు దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఉద్యోగులు ఆర్. భిక్షమాచారి, భిక్షం, నాగయ్య, చందపాక నాగరాజు, కొండయ్య, సావిత్రి, పుష్పలత పాల్గొన్నారు.



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట బతుమ్మకలతో నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

